


ఆంధ్రప్రభ
బుధవారం
25-10-2023
స్మార్ట్ ఎడిషన్
5
ఆంధ్రప్రభ





అవగాహన లేమి, అపోహలతో తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అనవసరంగా ఫిర్యాదులు చేస్తున్నారని తెలుగు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఈ తతంగం మొదలైందని, కేవలం తెలుగు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లనే టార్గెట్‌గా చేసుకుని ఫిర్యాదుల పర్వం కొనసాగుతోందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇంతకుముందు జరిగిన ఎన్నికల్లో ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నామని, తాము సమర్థంగా పనిచేసిన రికార్డు ఉందని స్పష్టం చేస్తున్నారు. కేవలం రాజకీయాల్లో భాగంగా తమను ఆయా పొజిషన్ల నుంచి తప్పించడానికి ఈ విధంగా ఫిర్యదులు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

- హైదరాబాద్, ఆంధ్రప్రభ

## ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లే

# టార్గెట్!

### తెలుగోళ్లపైనే ఎందుకీ వివక్ష



- ఎన్నో అపోహలు... మరెన్నో ఆరోపణలు!
- తమపైనే ఎందుకు ఇట్లాంటి చర్యలు?
- సత్తా ఏంటో గమనించరా?
- గత రికార్డులను అస్సలు పట్టించుకోరా
- ఏకపక్షంగా ఫిర్యాదులు ఎందుకిలా?

**ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఆవేదన**

హైదరాబాద్, ఆంధ్రప్రభ:

తెలంగాణలోని తెలుగువారైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను టార్గెట్ చేసుకోవడంపై ఆందోళన రేకెత్తుతోంది. ముందునుంచే ఒక ప్రణాళిక ప్రకారం తమను ఇబ్బందులకు గురిచేసే విధంగా చేస్తున్నారన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఎక్కడో ఒకటి రెండు చోట్ల అధికారులపై చర్యలు తీసుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ, వరుసగా కేవలం తెలుగు ఐఏఎస్, ఐపీఎస్‌లపైనా ఇట్లా జరగడంతో ఇదంతా ముందస్తు ప్రణాళికతో చేస్తున్నదేనని ఇట్టే తెలిసిపోతోంది. ఇందుకు కారణమైన రాజకీయ పార్టీలో కూడా తెలుగు వారే కదా నేతలని వారు గుర్తు చేస్తున్నారు. మన తెలంగాణ, మన సమాజం, మన సంప్రదాయమని చెప్పుకొచ్చే నేతలంతా ఈ విధంగా ఎందుకు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**ఆత్మాభిమానం దెబ్బతినేలా..**

తమ ఆత్మాభిమానం దెబ్బతినేవిధంగా.. తమనే టార్గెట్ చేసి ఫిర్యాదులు చేయడంపై తెలుగు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కాస్త సీరియస్‌గానే తీసుకుంటున్నారు. తమపై సవతి తల్లి ప్రేమను సూచిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడ్ వచ్చిన తర్వాత తమ పనితీరు గమనించకుండానే, సత్తాను అంచనా వేయకుండా ఫిర్యదులు చేయడం ఏమాత్రం వాంఛనీయం కాదన్నది వారి వాదన. ఆకస్మికంగా తమపై చర్యలు తీసుకోవడం తమ కుటుంబంపై కూడా ప్రభావం చూపుతోందని, వారు కుమిలిపోతున్నారని చాలామంది నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇంకా ఇలాంటి ఫిర్యాదుల ఘట్టం ముగియకపోవడం, తాజాగా మరి కొందరిపై ఫిర్యదులకు తెరతీయడంతో వారు తీవ్ర ఆవేదనతో రగులుతున్నారు. ఆత్మాభిమానం దెబ్బతింటోందనీ, ఇట్లా అయితే తామ పని విధానంపై ప్రభావం పడుతుందనే వాదన వినిపిస్తోంది.

**ఎన్నికల షెడ్యూలు వచ్చిన వెంటనే..**

తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే ఆయా స్థానాల్లో ఉన్న సీనియర్లను కూడా మార్చడం వెనుక ఈ ఫిర్యదుల పరంపరే కారణమని విస్పష్టంగా తేలిపోయింది. పైగా అప్పటికి కొద్ది రోజుల క్రితమే ఆ స్థానంలోకి వచ్చిన ఆయా అధికారుల పనితనాన్ని ఏ కొలబద్ద ప్రకారం అంచనా వేసి చర్యలు తీసుకున్నారన్న విమర్శలు కూడా చెలరేగుతున్నాయి. గత రికార్డు ప్రకారం చూసినా చాలామందికి అత్యున్నత ట్రాక్ రికార్డు ఉంది. అయితే ఇక్కడ కేవలం తెలుగు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులనే ఈవిధంగా టార్గెట్ చేయడం వెనుక వేరే కారణాలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

**వాళ్లను టచ్ కూడా చేయడం లేదు..**

ఇతర రాష్ట్రాలకు చెందిన అధికారులను ఏమాత్రం టచ్ చేయకుండా కేవలం తెలుగు వారిపైనే చర్యలు తీసుకోవడం వెనుక పలు లనుమానాలు ఉన్నాయి. ప్రభుత్వ పాలసీలను అమలు చేయడం తమ బాధ్యతని, అందుకు రాజకీయ కారణాలు చూపడం సబబు కాదని వారంటున్నారు. ఇప్పుడు ఫిర్యాదు చేస్తున్న పార్టీలకు సంబంధించి వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అక్కడి అధికారులు ప్రభుత్వ పాలసీలనే అమలు చేస్తుండడం వాస్తవం కాదా అని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.



## ఎన్నికల వేళ..

# బీజేపీకి.. పెద్ద దెబ్బ!

### పార్టీకి గుడ్ బై చెప్పిన కోమటిరెడ్డి రాజగోపాల్



- బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాలో పేరు లేకపోవడంతో మనస్తాపం
- కేసీఆర్ కబంద హస్తాల నుంచి తెలంగాణను కాపాడే పోరాటం చేస్తా
- ఎల్లుండి సోనియా, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ బ్యూరో :

అసెంబ్లీ ఎన్నికల వేళ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కమలం పార్టీకి గట్టి షాకిచ్చారు. బీజేపీకి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ప్రకటించిన ఫస్ట్ లిస్ట్‌లో ఆయన పేరు లేకపోవడంతోనే ఆయన పార్టీ మారబోతున్నారంటూ ఊహాగానాలు వినిపించాయి. ఆ వార్తలను నిజం చేస్తూ రాజగోపాల్‌రెడ్డి బీజేపీ రాజీనామాను ప్రకటించారు. మళ్లీ ఆయన సొంత గూటికే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు.
ఎల్లుండి హస్తినలో సోనియా, రాహుల్ సమక్షంలో హస్తం గూటికి చేరనున్నారు. 2018 ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తదనంతర పరిణామాలతో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కాషాయం గూటికి చేరారు. తర్వాత జరిగిన మునుగోడు బైపోల్స్‌లో బీజేపీ నుంచి పోటీ చేసి అపజయం మూటగట్టుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఆయన బీజేపీతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. తాజా రాజకీయ పరిణామాలతో తిరిగి సొంత గూటికి చేరాలని నిర్ణయం తీసుకున్నారు. తాజాగా బీజేపీకి రాజీనామా చేస్తూ ఈ మేరకు రాజగోపాల్‌రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**లేఖలో ఏముందంటే ..**

“కేసీర్ కుటుంబ దుర్మార్గపు పాలన నుంచి తెలంగాణను విముక్తి చేయాలనే నా ఆశయం. మరో ఐదు వారాల్లో నెరవేరుతుందని భావిస్తున్నాను. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంది. ప్రజలు మార్పును కోరుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. ఏడాదిన్నర క్రితం తెలంగాణలో అధికార బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా ఎదిగిన బీజేపీ, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో కొంత డీలా పడింది. ఇప్పుడు తెలంగాణ ప్రజలు అధికార బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను భావిస్తున్నారు. అందుకే నేను కూడా తెలంగాణ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాను.” అని తెలిపారు.
అవినీతిలో మునిగిన కేసీఆర్ సర్కారుపై కేంద్రం చర్యలు తీసుకుంటుందన్న తెలంగాణ ప్రజల కోరిక నెరవేరకపోవడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారుతూ వచ్చాయి. అధికార బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదగలేక పోవడంతో ఆ స్థానంలోకి కాంగ్రెస్ వచ్చింది. సకల జనుల పోరాటంతో సాకారమైన ప్రత్యేక తెలంగాణ పదేళ్ల కేసీఆర్ సర్కారు అరాచక పాలనతో గాడి తప్పింది. అధికార మార్పును కోరుకుంటున్న తెలంగాణ ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే నేను కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నాను. తప్పనిసరి పరిస్థితుల్లోనే బీజేపీకి రాజీనామా చేస్తున్నాను. మునుగోడు ఉప ఎన్నిక ద్వారా నాకు నియంతృత్వ కేసీఆర్ సర్కారుపై యుద్ధం చేసే అవకాశం కల్పించిన బీజేపీకి ధన్యవాదాలు. కేసీఆర్ సర్కారుపై యుద్ధం చేయాలని ప్రోత్సహించిన కేంద్ర మంత్రి అమిత్ షాకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. తెలంగాణ ప్రజల ఆలోచనల మేరకు పార్టీ మారాలని నేను తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ పెద్దలు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. నాడు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరినా, నేడు బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి మారుతున్నా లక్ష్యం మాత్రం ఒకటే. కేసీఆర్ కుటుంబ అవినీతి, అరాచక, అప్రజాస్వామిక పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడమే. నేను ఏనాడూ పదవుల కోసం ఆరాటపడలేదు, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసమే తపన పడ్డాను. నియంత కేసీఆర్ పాలనను అంతమొందించేందుకు కాంగ్రెస్ లో చేరుతున్న నన్ను ఆదరించాలని రాష్ట్ర ప్రజలని కోరుతున్నాను.” అని రాజగోపాల్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

**అవినీతి పాలనకు చరమగీతం పాడుతా..**

తెలంగాణలో అవినీతి అరాచక నియంతృత్వ కుటుంబ పాలనకు చరమగీతం పాడే శక్తి భారతీయ జనతా పార్టీకే ఉందని భావించి 15 నెలల క్రితం నేను మునుగోడు ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం అందరికి తెలిసిందే. గత ఏడాది అక్టోబర్ నెలాఖరున మునుగోడు అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమీషా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా గారి ఆశీస్సులతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి అధికార బీఆర్ఎస్ ను ఓడించినంత పని చేశాను. ఒక రాజకీయ యుద్ధం మాదిరిగా జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ 100 మంది ఎమ్మెల్యేలు మరో వంద మంది ఇతర సీనియర్ నేతలను ప్రచారంలోకి దింపి వందల కోట్లు ఖర్చు చేసి, భారీ స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పటికీ స్వల్ప తేడాతో నెగ్గి, నైతికంగా ఓడింది. మునుగోడు ఉప ఎన్నికల్లో నా విజయం కోసం ప్రయత్నించిన బీజేపీ నేతలు కార్యకర్తలు శ్రేయోభిలాషులందరికీ మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను.